కథ

# వెలుగు బాట

**అరుణా మోహన్**

**వర్షం! వర్షం!! ఉదయం నుండి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది.**

**సమయం రాత్రి ఏడు గంటలు కావస్తోంది.**

**పని ఒత్తిడిలో బిజీగా ఉన్నాను.**

**"ఎక్స్‌క్యూజ్ మి సర్!"**

డోర్ వద్ద ఓ యువకుడు నిలబడి ఉన్నాడు.

21-22 సంవత్సరాల వయసుంటుందేమో బహుశ.

చిరునవ్వుతో తలూపాను. లోపలికి రమ్మన్నట్లుగా.

లోపలికి వచ్చాడు హుందాగా.

''కూర్చోండి''

''థాంక్యూ''

చప్పుడు కాకుండా కుర్చీని కొద్దిగా వెనక్కు జరిపి కూర్చున్నాడు. అతని చేతిలో ఉన్న ఫైల్ నా టేబిల్ మీద పెట్టాడు.

''నా పేరు చంద్రం! దాదాపు నాలుగున్నర సంవత్సరాల క్రితం మిమ్మల్ని కలిశాను. ఇప్పుడు మళ్ళీ మిమ్మల్ని కలిసి మాట్లాడడం చాలా ఆనందంగా ఉంది'' అన్నాడు.

నవ్వాను సమాధానంగా.

అతనెవరో గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నించాను. కానీ జ్ఞాపకం రాలేదు. నేను తనను గుర్తుపట్టలేదన్న విషయం ఆ యువకుడికి తెలియకుండా జాగ్రత్తపడ్డాను.

ఓ ప్రముఖ దినపత్రికకు నేను సంపాదకుడిగా పని చేస్తున్నాను. అపాయింట్‌మెంట్ లేకపోయినా కూడా ఎవరైనా నన్ను కలిసి మాట్లాడేందుకు వీలుంది. నిత్యం పనుల మీద ఎందరో వచ్చి వెళుతుంటారు. గతంలో ఏదో ఒక సందర్భంలో ఇతను నన్ను కలిసి ఉండవచ్చు అనుకున్నాను.

ఏసి ఆఫ్ చేసి కిటికీ తలుపులు తెరిచి ఉంచడం వల్ల సహజ సిద్ధమైన చల్లటి గాలి శరీరానికి తాకి ఆహ్లాదకరమైన భావన కలుగుతోంది.

''చెప్పండి'' అన్నాను అతన్ని మాట్లాడడానికి ప్రోత్సహిస్తూ.

టేబిల్ మీద ఉన్న ఫైల్ తెరిచి నా వైపు తిప్పాడు చూడమన్నట్లుగా.

ఫైల్ అందుకున్నాను.

దాదాపు నాలుగున్నరేళ్ళ క్రితం మా పత్రికలో ప్రచురితమైన బాక్స్ ఐటెమ్ న్యూస్ అది!

మొదటి వాక్యం చదవడం పూర్తికాకముందే అతనెవరో గుర్తించాను.

సంభ్రమంగా తలెత్తి ఎదుట కూర్చున్న చంద్రం వైపు చూశాను.

మాట్లాడడానికి బిడియపడుతూ ఆనాడు నన్ను కలిసిన పదిహేడేళ్ళ చంద్రమే ఈ యువకుడని తెలిసి ఆనందంగా అనిపించింది.

తనను నేను గుర్తుపట్టానన్న సంగతి గ్రహించాడు కాబోలు చంద్రం. ముఖంలో చిరునవ్వు తొంగి చూస్తోంది.

మొదటిసారి చంద్రం నన్ను కలుసుకున్న సంఘటన జ్ఞాపకం చేసుకున్నాను.

ఆత్మాభిమానాన్ని పక్కన పెట్టి కుటుంబ ఆర్థిక స్థితి గురించి వివరిస్తూ ఆ వేళ ఇలాగే న్యూస్‌పేపర్ మడతలో దాచిన సర్టిఫికెట్లు చూపించాడు.

అతని అకడమిక్ రికార్డ్ చూసి ఆ రోజు ముచ్చటపడ్డాను. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించాడు చంద్రం. చెన్నయ్ ఐఐటిలో చేరేందుకు సీటు వచ్చింది. ఫీజు కట్టేందుకు ఆర్థిక స్తోమతు లేదని, వచ్చిన సీటు చేజేతులా జారవిడుచుకోవలసిన పరిస్థితి అని చెప్పాడు. స్నేహితుడి అన్నయ్య సలహా మేరకు ధైర్యం చేసి నన్ను కలిసేందుకు వచ్చినట్లు చెప్పాడు.

వెంటనే నిర్ణయం తీసుకున్నాను.

సబ్ ఎడిటర్ కల్పనను పిలిచి క్లుప్తంగా విషయం చెప్పాను. ఆమె వెనుక బయటికి వెళ్ళేందుకు ఉద్యుక్తుడవుతూ వినమ్రంగా చేతులు జోడించి నమస్కరించాడు.

మర్నాడు పేపర్‌లో అతని ఫోటో, వివరాలు ప్రచురించబడ్డాయి. నిరుపేద కుటుంబంలో పుట్టి చదువులో విశేషమైన ప్రతిభ కనబరచి ఐఐటి ర్యాంక్ సాధించిన చంద్రం గురించి తెలుసుకుని చాలామంది పాఠకులు స్పందించారు. అతనికి సహాయపడేందుకు విశాల హృదయంతో ముందుకు వచ్చారు. ప్రభుత్వం తరఫున కూడా అతనికి సహాయం లభించింది. చంద్రం ఐఐటిలో చేరేందుకు వీలుగా అవసరమైన ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఆ తర్వాత పది రోజులకు మళ్ళీ మా ఆఫీసుకు వచ్చాడతను.

నోరు తెరిచి కృతజ్ఞతలు చెప్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. చంద్రం కళ్ళలో నీళ్ళు. పెదవులు పలకలేని మాటలను చెమ్మగిల్లిన కళ్ళు తెలియజెప్పాయి.

అతని కన్నీళ్ళు చూడనట్లు ఊరుకున్నాను. ఏ సమయంలో ఎంతమేరకు స్పందించాలో నా హోదా నాకు నేర్పింది.

''గుడ్ లక్'' అన్నాను ఓ ముఖ్యమైన న్యూస్ ఐటమ్ చూస్తూ.

ఆ రోజు చూసిన చంద్రాన్ని మళ్ళీ ఇప్పుడు చూస్తున్నాను.

చదువు, అనుభవం, దీక్ష నేర్పిన పాఠాల వల్ల కాబోలు అతనిలో ఇప్పుడు ఆనాటి నిస్సహాయత కనిపించడం లేదు.

చంద్రం చూపుల్లో కొండంత ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జీవితంలో అనుకున్నది ఏదైనా సాధించగలనన్న నమ్మకం అతని కళ్ళలో తొంగి చూస్తోంది.

చంద్రం మాట్లాడసాగాడు.

''నా గురించి అపుడు మీరు పేపర్‌లో వేయడం వల్ల చాలామంది సహాయం చేశారు. ఎవరికి తోచింది వారు విరాళంగా పంపారు. ఆ విధంగా అందిన ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా వాడుకున్నాను. నాకు శుభం కలగాలని ఆకాంక్షిస్తూ మరెందరో ఉత్తరాలు రాశారు. దాతలు రాసిన ఉత్తరాలు, మనోబలం అందించిన వారు రాసిన ఉత్తరాలు ఇందులో ఉన్నాయి'' చెప్పాడు.

ఫైల్ తిరగేశాను. పేపర్ కటింగ్‌తో పాటు ఎన్నెన్నో ఉత్తరాలు కనిపించాయందులో.

''నాకు సహాయం చేసిన వారిని నేనెన్నటికీ మరిచిపోను. రోజుకు ఒక్కసారైనా ఆ ఉత్తరాలు చూసుకుంటాను'' అన్నాడు చంద్రం.


మౌనంగా వింటున్నాను.

''ఆ రోజు సాయం చేసి, నా జీవితాన్ని అందమైన మలుపు తిప్పింది మీరే! ఇప్పుడు మళ్ళీ ఓ సహాయం చేయగలరా?'' అడిగాడు చంద్రం.

అతని ముఖంలో చిరునవ్వు తొంగి చూస్తోంది కానీ బిడియం, నిస్సహాయత లేవు.

నా నుండి అతను ఆశించే సహాయం ఏమై ఉంటుంది? కొద్ది క్షణాలు ఆలోచించాను. కానీ ఊహకు అందలేదు.

''చదువు పూర్తయింది. కాలిఫోర్నియాలో ఉద్యోగం వచ్చింది. ఎల్లుండి రాత్రి ప్రయాణం''



అన్నాడు.

అప్పటివరకు సంతోషంగా అతన్ని చూస్తున్న నాలో ఇదీ.అని స్పష్టంగా చెప్పలేని ఫీలింగ్ కలిగింది. నిశ్శబ్దంగా చంద్రం మాటలు వింటున్నాను.

''కొద్ది సంవత్సరాల క్రితం నేను ఎలాంటి దీన పరిస్థితిలో ఉన్నానో నాకు ఇంకా గుర్తుంది. ప్రతిభ, ఆసక్తి ఉండి డబ్బులేక ఉన్నత చదువులు చదవలేని నాలాంటి బీద విద్యార్థులు ఎందరో ఉన్నారు. అందరినీ నేను ఆదుకోలేకపోవచ్చు. అలాంటి వారిలో కొందరికైనా చేయూతనందించాలని నా కోరిక. అందుకే వచ్చిన అవకాశాన్ని చేజిక్కించుకుని రెక్కలు కట్టుకుని అమెరికా వెళుతున్నాను. నా ప్రతిభను నిరూపించుకుని జీవితంలో మరింత ఉన్నతమైన స్థాయికి ఎదిగేందుకు పరాయి దేశానికి వెళుతున్నాను కానీ విలాసవంతమైన జీవితం గడపా

లన్న వ్యామోహంతో వెళ్ళడం లేదు. డబ్బు సంపాదించి ఇక్కడ ఉన్న పేద విద్యార్థుల్లో కొందరినైనా ఆదుకోవాలని.నా ఆశ.'' కొద్ది క్షణాలు ఊరుకుని చెప్పడం కొనసాగించాడు.

''ఇందుకోసం ఓ ట్రస్ట్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. ట్రస్ట్ నిర్వహించే బాధ్యత నమ్మకమైన వారికి అప్పగించాలి. మొదటి నెల జీతం అందుకున్న వెంటనే ఇక్కడ సహాయ కార్యక్రమాలు మొదలుపెట్టాలని నా ఉద్దేశ్యం. మీరు ట్రస్టీగా ఉండగలరా?'' అభ్యర్థనగా అడిగాడు.

''అయామ్ సారీ'' వెంటనే జవాబు చెప్పాను.

అతని ముఖం చిన్నబోయింది.

చంద్రం అభ్యర్థన తిరస్కరించినా మాట సహాయం చేస్తే బావుండు అనిపించింది.

''ట్రస్ట్ నిర్వహించే బాధ్యత నేను తీసుకోలేను. కానీ మీకొక సహాయం చేయగలను. నాకు తెలిసిన వారిలో సేవాభావంతో పనిచేసే కొందరి వివరాలు ఇస్తాను. వారితో మీరు నేరుగా మాట్లాడి ఫోన్ చేసుకోండి'' అన్నాను.

''అలాగే'' చంద్రం సంతోషంగా అన్నాడు.

''ఇప్పటికిప్పుడు వివరాలు ఇవ్వలేను. కొంచెం వ్యవధి కావాలి. రేపు కలవండి'' అన్నాను.

''ఓకే సర్''

కుర్చీలో నుండి లేచి నా చేతుల్లో ఉన్న ఫైల్ అపురూపంగా అందుకున్నాడు.

సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు చంద్రం.రెండు నిమిషాల పాటు అతని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను.

ఉదయం మా అబ్బాయి పినాకపాణి తల్లితో అన్న మాటలు నా చెవుల్లో పడ్డాయి. వాడు కూడా ఇంచుమించుగా ఇలాగే మాట్లాడాడు.

''అమ్మా! నేను ఉద్యోగం కోసం అంత దూరం వెళ్ళడం నీకు, నాన్నకు ఇష్టం లేదు కదూ! పైకి చెప్పకపోయినా మీ ఫీలింగ్స్ నాకు తెలుస్తూనే ఉన్నాయి. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలని నా ఆశ. ఇక్కడ లేని అవకాశాలు అక్కడ ఉన్నప్పుడు వాటిని అంది పుచ్చుకోవడం తప్పెలా అవుతుంది? మీరు మనస్ఫూర్తిగా పంపితేనే నేను అమెరికా వెళతాను'' అన్నాడు సువర్చలతో.

బిడ్డలకు విదేశాల్లో ఉద్యోగం రావాలని నూటికి తొంభై ఎనిమిది మంది తండ్రులు కోరుకుంటున్న ఈ రోజుల్లో మా అబ్బాయి విదేశాలకు వెళ్ళకుండా ఇక్కడే ఏదో ఒక ఉద్యోగం అని సరిపెట్టుకుంటే బావుండు అని నేను మనసులో బలంగా కోరుకుంటున్నాను. సువర్చల కోరిక కూడా అదే!

ఆ మాట పైకి స్పష్టంగా చెబితే వాడు నిరాశపడతాడని సంశయిస్తూ లోలోపల మధన పడుతున్నాము. వాడిని మంచిచదువు అయితే చదివించాము కానీ పొట్టకూటికి మమ్మల్ని వీడి దూరంగా వెళ్ళడం నాకిష్టం లేదు.

ఉన్నతమైన స్థాయికి ఎదగాలని, పదిమందికీ మంచి చేయాలని వాడి కోరిక. పిల్లలు సరైన దారిలో వెళుతున్నారన్న నమ్మకం ఉన్నప్పుడు అర్థం లేని భయాలతో, తీవ్రమైన మమకారంతో వారిని అడ్డుకోకుండా, ఆనందంతో సాగనంపడం మంచిదనిపించింది.

పాణితో మాట్లాడాలనుకుని వెంటనే ఇంటికి ఫోన్ చేశాను.

''హలో'' అంది సువర్చల.

ఆమె నా జీవన సహచరి. గత పాతికేళ్ళుగా నాతో సహజీవనం చేస్తూ వృత్తిలో నేను పైకెదగడానికి చేయూత నందించిన అర్థాంగి.

నిత్యం అర్ధరాత్రివేళ ఆఫీస్ నుండి అలసటతో ఇంటికి చేరుకుంటే మరుక్షణంలోనే తలుపు తీసే నేర్పు, ఓర్పు ఉన్న ఇల్లాలు. సమర్థుడైన సంపాదకుడిగా బయటి ప్రపంచంలో పేరు తెచ్చుకున్నాను కానీ ఇంటి వ్యవహారాలలోను, పిల్లల చదువు సంధ్యల విషయంలోను పెద్దగా పట్టించుకోను.



అంతా తనే చూసుకుంటుంది. తనను అభినందించడానికి, కృతజ్ఞతలు తెలపడానికి పురుషాహంకారం అడ్డొస్తుంది. నా భార్య ఓ విలక్షణమైన స్త్రీమూర్తి అని మనసులో అనుకుంటాను కానీ పైకి అనను. ''పాణి ఏం చేస్తున్నాడు?'' అడిగాను సువర్చలను.

''ఇప్పుడే బయటికి వెళ్ళాడు'' చెప్పింది.

''జీవితం పట్ల వాడికి కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు, ఆశయాలు ఉన్నాయి. తన జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుకోగలడని, సమాజానికి మేలు చేయగలడని నా నమ్మకం. వాడిని సంతోషంగా సాగనంపుదాం! మన ఆశలకు తగిన విధంగా కాకుండా తన ఆశయాలకు అనుగుణంగా వాడు జీవితంలో ముందుకు వెళితే బావుంటుంది'' అన్నాను.

సువర్చల నిశ్శబ్దంగా ఊరుకుండిపోయింది.

''అలాగే'' అంది కొద్దిక్షణాల తర్వాత.

''ఉద్యోగం కోసం వాడు ఎక్కడికి వెళ్ళినా మనకు అభ్యంతరం లేదని, ప్రయాణం ఏర్పాట్లు చూసుకోమని చెప్పు''.

''సరే'' అంది మనస్ఫూర్తిగా నా మాటలతో ఏకీభవిస్తూ.

ఫోన్ పెట్టేశాను.

గత కొద్దివారాలుగా మనసులో ఉన్న వేదన తొలగిపోయి రిలీఫ్‌గా అనిపించింది.

రేపటి పేపర్‌లో ప్రచురించే ఓ సంచలనాత్మక కథనానికి తుది మెరుగులు దిద్దసాగాను.

## తమిళ తెరపై మల్లికా షెరావత్

**బాలీవుడ్ హాట్ సుందరి మల్లికా షెరావత్‌ని దక్షిణాదికి తీసుకొస్తున్నాడు కమల్ హాసన్. తన తాజా చిత్రం 'దశావతారం'లో మల్లికకు ఓ ముఖ్య పాత్రని ఇచ్చి తమిళ తెరపై నటింపచేస్తున్నాడు. చిరంజీవి కొత్త చిత్రం 'స్టాలిన్'లో ఐటమ్ సాంగ్ చేయాల్సిన మల్లికా షెరావత్ ఎందుకో కొద్దిలో ఆ చాన్స్‌ని మిస్సయినా ఇప్పుడీ 'దశావతారం'లో నటిస్తూ సౌత్‌కి వస్తోంది.**